


# వెదురుగొట్టంలో వెండిగజ్జెలు

—— కోమలాదేవి

పండు వెన్నెల రేయి.

పది గంటలు దాటింది. ఎక్కడా సద్దుమణగ లేదు. భోజనాలు ముగించుకుని చిన్నా పెద్ద-పేదలు ధనికులు అంతా బయటికి వచ్చి తెలివెన్నెలలో కూర్చుని ఆ చల్లదనంలో హాయి అనుభవిస్తున్నారు.

కాంచన పిల్లలు డాబా మీదికి వెళ్ళటానికి లేచారు. వారి ఇంటిని ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో ఇసుకపోసి ఉంది. అదొక చిన్నరకం ప్లేగ్రౌండ్. అక్కడ యెదర మగవాళ్ళు జేరి కోలాటం వేస్తారు. కాళ్ళకు గజ్జెలు కట్టి పంచెలు బిగించి కట్టి పై వస్త్రం ఏమీ లేకుండా ప్రథమంలో మెల్లగా అడుగులువేస్తూ కోలాటం కర్రల్ని టిక్ టిక్ న కొడ్తూ ప్రారంభం అవుతుంది కోలాటం. తరువాత టెంపో హెచ్చుతుంది. లయ తప్పకుండా - పాట వేగం హెచ్చించి-అడుగులు త్వరితగతిని వేస్తూ మహా హుషారుగా సాగే ఆ కోలాటంకు ఎంతో ప్రాక్టీస్ ఉండాలి. వెన్నెల రాత్రి - అదీ పౌర్ణమి నాడు వారు కోలాటం వేసి ఆ తరువాత తప్ప త్రాగటం వాళ్ళ రివాజు.

పిట్టగోడను ఆనుకుని నుంచునున్నారు. చిన్న గుంపు ప్రోగైంది. కోలాటం కర్రల్ని తెచ్చి కుప్పగా పడేశారు. కొంతసేపటికి పాల్గొనేవారం తావలయాకారంలో నుంచున్నారు. ఎవరో పాట ప్రారంభించారు, ఒక్కొక్క గజ్జె ఘల్లుమన్నది. మరి కొంతసేపటికి పాట - గజ్జెలు - కర్రల చప్పుడు జోరుగా వినిపించింది.

పైసా ఖర్చు పెట్టకుండా పిల్లలకు మంచి కాలక్షేపం అనుకుంది కాంచన. జానపద నృత్యాలు చూడాలంటే ఎక్కడో ఢిల్లీలో రిపబ్లిక్ డే సమయంలో చూడాల్సిందే. పల్లెలకు వెళ్ళి ఎవరు చూస్తారు? లేకపోతే కాలేజి విద్యార్థినులు స్టేజి మీద చేసి చూపిస్తారు!

ఈ కోలాటం ఎంత సహజంగా ఉంది! సైకస్థలి రంగస్థలం అయితే పూర్ణ చంద్రుడు ఫ్లడ్ లైట్ అయి కోలాటానికి అందం చేకూర్చాడు.

గంటసేపు వేసిన తరువాత వాళ్ళు అపుజేసి నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ వెళ్ళి పోతున్నారు. వారి తరువాతి కార్యక్రమం తలచు కుని కాంచన బాధపడింది. సంపాదించినదంతా ఖర్చు చేసి త్రాగి ఒళ్ళు తెలియకుండా రెండు రోజులు పడి ఉంటారు.

పిల్లలు భర్త పడుకుని నిద్రపోయారు. కాని కాంచనకు నిద్రపట్టలేదు. ఆ చిక్కని వెన్నెల రాత్రి ప్రశాంతతను భయంకరంగా భంగపరుస్తూ ఏదో గోల - ఓ స్త్రీ ఆర్తనాదం - కేకలు - బూతులు వినిపించాయి. అక్కడి వారంతా ఆమెకు సుపరి చితులే. ఆదోని పట్టణంలో నీటికి ఇబ్బందిగా ఉండేది. కొళాయిలు అక్కడక్కడ ఉండేవి. రోజుకు కొన్ని గంటలు మాత్రమే నీళ్ళు విడుస్తారు. కాంచన వాళ్ళ కాంపౌండ్‌లో కొళాయి ఉంది. మంచినీళ్ళు కోసం చుట్టుప్రక్కల వాళ్ళంతా ఆ కొళాయికి వస్తారు. యెదర ఆడవాళ్ళంతా ప్రతి రోజు పదిగంటలనుండి వచ్చి బిందెలు నింపుకుని ఎగతారు. కాంచన వాళ్ళకోసం మూడు గంటలు కేటాయించింది. నీళ్ళు నింపుకుని ఎంతో కృతజ్ఞతతో వెళ్తారు. అప్పుడప్పుడు కష్టసుఖాలు చెప్పు కుంటారు. కాంచనవారికి చిన్న చిన్న పనులు చేసేది. ఉత్తరాలు రాసిపెట్టేది. డబ్బులు దాచి పెట్టమని యిస్తే దాచేది. (ఏనాడూ పాపం పది దాటదు). పెన్సిల్ ముక్కలు ఇచ్చేది. పిల్లల్ని బడిలో వేయాలంటే రికమెండ్ చేసేది. అన్నింటి కన్నా ముఖ్యమైన సేవ బదులు పదులు అప్పు కోసం వస్తే ఇచ్చేది. ఈ సేవకు బదులుగా వారు కాంచనకు ఇంటిపనుల్లో సహాయం చేసేవారు. బియ్యం బాగుచేసి ఇవ్వటం మొదలు కారం— పసుపు దంచటంలోను తోటపనిలోను సాయం చేసేవారు.

అదొక విధమైన స్నేహం. దీనికి అంతస్తులు హోదాలు అడ్డురాలేదు. కాంచనమ్మ ఆదుకుంటుం దన్న అభిమానం గౌరవం వారికుండేది. పాపం- వీళ్ళు "మామూలు భారత స్త్రీలు" అన్న జాలి కాంచనకు ఉండేది. ఎవరికి ఎవరు అనుకునే ఈ రోజుల్లో కాంచన పిలవగానే పలికే ఆ ఆడ

వారిపై కాంచనకు జాలి, ప్రేమ, కృతజ్ఞత కూడా. కాంచనకు ఇబ్బందిగా ఉంటే తమ పని మాని చాటుగా గిన్నెలు తోమి వెళ్ళేవారు. భర్త కాంప్‌కు వెళ్తే పిల్లలు చంటివాళ్ళుగా ఉన్నప్పుడు వారికి నలతగా ఉంటే ఒంతులేసుకుని సాయం ఉండేవారు.

"మద్యపాన నిషేధం" రోజుల్లో ఇంట్లో త్రాగి గొడవచేసినా పోలీసులు పట్టుకెళ్ళి డాక్టర్ చేత పరీక్ష చేయించి జైల్లో వేసేవారు. జరిమానా కట్టి వాడిని విడిపించుకునే ఒంతు ఇంట్లో కుటుంబ సభ్యులది.

కాని ఇప్పుడు స్వేచ్ఛగా త్రాగి ఇంటిని గుల్ల చేసి గొడవ చేసినా, భార్యను బాదబాదినా అడిగే దిక్కులేదు. ఏ పోలీసూ వచ్చి లాక్కుని వెళ్ళి జైల్లో వెయ్యరు.

ఒక రాత్రి అప్పుడు మేదరోళ్ళ ఇళ్ళవైపు నుండి అల్లరితిట్లు గొడవలు వినిపించాయి. ఒక్క నిట్టూర్పు ఒదిలి ఒత్తిగిలి పడుకున్నది.

తెలతెలవారుతుండగా ఎవరో తలుపు తట్టారు. ఆ తట్టటం చూస్తుంటే చాలా హడావిడిగా అత్యవసరంగా ఉన్నట్లు తోచింది. గబగబ వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా నాగమ్మ.

"అమ్మా-ఇది లోనదాయమ్మా. ఇదే మిగిలింది." అంటూ ఆమె ఇష్టా ఇష్టాల్ని కనుక్కోకుండా ఒక రాగిబిందెను అక్కడపెట్టి కుండను నింపుకుని వెళ్ళిపోయింది.

కాంచన రాగిబిందెను చేతులతో ఎత్తింది. బాగా బరువుగా ఉంది. అవతలికి తీసుకెళ్ళి లైటు వేసి చూచింది. లోపల వెండి నగలున్నాయి. కడియాలు కాళ్ళపట్టీలు, డాబులు, సిగ్గు బిళ్ళలు, మురుగులు సిగ పిన్నులు ఉన్నాయి. డాబు (ఒడ్డాణం) ముక్కలున్నాయి!

"కాంచనా-ఈ బాధ్యత నీకెందుకు. రేపు ఒక వస్తువు తక్కువైంది అంటే?" ఆమె భర్త రమేశ్ అయిష్టత కనపర్చాడు కాంచన బిందెను లోపలపెట్టి భర్త దగ్గరకు వచ్చి కూర్చుంది. ఆమె హృదయంలోని అల్లకల్లోలాన్ని గుర్తించి ఆమె భుజాల చుట్టూ చేయివేశాడు. "కాంచనా - ప్రతి పౌర్ణమినాడు నీలో ఈ అలజడి ఉంటుంది. మన దేశంలో సగటు కుటుంబాలలో జరిగే కథలు ఇవి - స్త్రీ తన రక్షణకోసమో - లేకలోకానికి భయపడో - లేక పతివ్రత అనిపించుకోవాలన్న కాంక్షచేతో - లేక అతగాడిపై ఉన్న ప్రేమ వల్లనో-ఏదైనాగాని అతడికి లొంగి అణగి మణగి ఉండడమే కాక చావు దెబ్బలు తింటుంది. రేపు త్రాగుడుమైకం నుండి బైటబడి బుద్ధిగా ఉంటాడు. ఆ వెండి వస్తువులు నీ దగ్గర ఉన్నాయని తెలిస్తే నీకు శాంతి ఇస్తాడా? వాటిని తీసుకునేవరకు ఒదలడు. అందుకే ఇలాంటి వ్యవహారాలలో జోక్యం కల్గించుకోవద్దంటున్నది."

"ఔను. మీరన్నది నిజమే. కాని వాళ్లు అలా అనరు. అసలు నాగమ్మ భర్తకు ఈ విషయాలేం తెలియవు. ఇవన్నీ ఆడవాళ్ళ వ్యవహారాలు. వాళ్లు అబద్ధం చెప్పరు. వస్తువుల్లో ఒకటి తగ్గింది అనరు...."

కాంచన భర్త చేయి పట్టుకుని మూల గదిలోకి తీసుకెళ్లింది. పై అటక వేపు చూపిస్తూ "ఆ పైన ఏమేమో ఉన్నాయి. సున్నాలు కొట్టేటప్పుడు దిగుతాయి. మళ్ళీ ఎక్కుతాయి. ఆ చెంబులు బిందెలు అన్నీ వాళ్ళవే. కొన్ని ఇక్కడికి వచ్చి పదేళ్ళు దాటాయి. ప్రతి వస్తువు మీద పేర్లున్నాయి. వాళ్ళు ఇంతవరకు అడగలేదు. కాంచనమ్మ దాచింది అనుకుంటారు. ఆడపిల్లలకు పెళ్ళి చేసి పంపేటప్పుడు పట్టుకెళ్తారు. సంక్రాంతికి కొందరు వచ్చి తళతళ మెరిసేలా తోమి సంతృప్తిగా చూచుకుని మళ్ళీ నాకిచ్చి "అమ్మా - నీ అటక మీదున్నా బాగా ఉండాల" అని వెళ్తుంటారు. నేను దాదాపు పాతిక సంవత్సరాలుగా వారందర్నీ ఎరుగుదును. మీకా భయం అక్కరలేదు. నిశ్చింతగా ఉండండి...." అంది.

ఐదున్నర అయింది. ఇద్దరూ కాఫీ త్రాగి బైట వరండాలో కూర్చున్నారు. కాంచనకు ఒక సంఘటన గుర్తుకు వచ్చింది.

"దాదాపు ఎనిమిదేళ్ళ క్రితం ఇలాగే నాగమ్మ ఉదయం నాలుగ్గంటలకు వచ్చింది..." అంటూ ప్రారంభించింది,

రమేశ్ కుతూహలంతో వింటున్నాడు.

"అమ్మా-అమ్మా నేను నాగమ్మని. తొరగా తియ్యి" అంటూ హడావిడి చేసింది నాగమ్మ.

కాంచన తల్లి పరిమళమ్మ వెళ్ళి తలుపు తీసింది.

ఆమె చేతిలో బంగారు పోగులు పెట్టి దండం పెడ్తూ అంది.

"పెద్దమ్మా - ఇయ్యాల పదిగంటలకు నా మొగుడు కొండల్లో కెల్లి నాటుసారా తెత్తాడంట. నా పిల్ల దాని పోగులూడబీక్కుపోతాడంట. జాగర్త జేయి తల్లీ" అని వెళ్ళిపోయింది. ఆ పోగులు చేతిలో తూచి అంచనా వేసింది పరిమళమ్మ. అరతులానికి పైనే ఉన్నాయి!

నాగమ్మ చావుదెబ్బలు తిన్నదేగాని అవి ఎక్కడ దాచిందో తెలియనివ్వలేదు.

మరుసటిరోజు రాత్రి పదిగంటలకు శోకదేవతలా వచ్చింది. వరండాలో చతికిలబడింది.

"ఏం నాగమ్మా?" పరిమళమ్మ పలుకరించింది.

"ఏం చేతును తల్లీ - పోలీసోళ్ళు కొండల్లో వండుతున్న కాడికెళ్ళి అందర్నీ పట్టుకున్నారు. జైల్లో యేసింద్రు ఇడిపించాలంటే ఇరవై రూపాయలియ్యాల. రేపు సంతగదమ్మా చేటలు ఇసనకర్రలు అమ్మాల. జైలు బైటికొత్తే ఇద్దరం అమ్ముతాం. దుడ్డు రాగానే ఇత్తానమ్మా."

"పదిగంటల రాత్రప్పుడు - డబ్బు కావాలంటావేం నాగమ్మా-ఎవరైనా ఇస్తారా? తెల్లవారి రా."

"ఇడిపించుకు రాటానికి మా పెద్దోల్లు ఇప్పుడే పోతుండారమ్మా....పొద్దుగూకినాక రాటం తప్పే తల్లీ–నానేంచేతును?" అంది వచ్చేకన్నీరు అపుకుంటూ.

కాంచనకు జాలేసింది. నిండునెలలు ఇప్పుడు అప్పుడు అన్నలా వుంది కాంచనపరిస్థితి. రాత్రుళ్ళు డబ్బు బయటికి పోకూడదన్న పిచ్చినమ్మకం కంటే ఒక స్త్రీ హృదయం బాధపడటం సహించలేక పోయింది.

"అమ్మా - ఫరవాలేదు ఇవ్వు" అంది.

కూతురువైపు ఒకమారు చూచి ఆమె నాగమ్మకు డబ్బు ఇచ్చి పంపింది.

నాగమ్మ భర్తే కాదు – దాదాపు అందరూ కష్టపడి అల్లిన చేటలు బుట్టలు తడికెలు మంచాలు అన్నీ అమ్మిన తరువాత వచ్చే డబ్బులు ముప్పాతిక పైగా వారి వ్యసనాలకు వాడేవారు. డబ్బు చాలక ఒక్క వస్తువు తాకట్టుపెట్టటం–ఆ డబ్బుతో కూడా త్రాగటం మామూలై పోయింది. ఆడవాళ్ళు చాటుగా అమ్ముకుని ఒక్కో రూపాయి నిలువచేసి, ఒక్కో నగ విడిపించుకునేవారు.

మరుసటిరోజు ఉదయం నాగమ్మ నీళ్ళకోసం వచ్చింది. భర్త ఇంటికి వచ్చేశాడన్న ఆనందం ఆ ముఖంలో ఇసుమంతయినా లేదు. చాలా ముభావంగా నీళ్లు పట్టుకుని వెళ్ళిపోయింది. "పాపం,

మళ్ళీ నాలుగు రోజులు పోయాక జైలుకెళ్ళడన్న నమ్మకం ఏముంది?'' అంది పరిమళమ్మ.

ఆమె అన్నట్లే పదిరోజుల్లో వాళ్ళకు మంచి బేరం తగిలింది. ట్రక్ వచ్చి బుట్టలన్నిటినీ కొని వేసుకుని వెళ్ళిపోయింది. ఒక్కరోజున చేతిలో ఎనభైరూపాయలు పడగానే నాగమ్మ భర్తేకాదు చాలామంది కొండలవేపు వెళ్ళిపోయారు. ఆ వెళ్ళటం వెళ్ళటం పది రోజులవరకు రాలేదు.

ఎక్కడికి వెళ్ళారో అందరికీ తెలుసు. కాని ఒక్కరు కూడా బైటికి పొక్కనివ్వ లేదు.

పిల్లలందరికీ మూడు పూటలు అన్నం జొన్న రొట్టె పప్పు కూరలు దొరుకుతున్నాయి. ఈమార్పు కొట్టవచ్చినట్లు కనబడుతోంది.

చిన్న పిల్లలు చిన్నబిందెలతో కొళాయికి వచ్చారు. తలలు దువ్వుకుని రిబ్బన్ కట్టుకుని ఉతికిన పరికిణీ వేసుకుని ముద్దు ముద్దుగా వున్నారు పిల్లలు.

తోటలో కూరగాయలు కోస్తున్న కాంచనను చూచి "దండం అమ్మా" అన్నారు.

"ఏం-బడికి వెళ్ళలేదా?" అని పలుకరించింది.

"పోవాలమ్మా. మా యమ్మ రొట్టె చేస్తాంది. నీళ్ళకోసం వచ్చినాము"

"మా యమ్మ ఈ పొద్దు పుండుకూర పప్పు ఎనిపింది" అంది మరోపిల్ల.

పాపం పిల్లలు తిండికి వాచిపోయి వున్నారు. ఇప్పుడు బాగా కడుపునిండా తింటున్నారు.

డాబా ఎక్కి చూచింది కాంచన. గుడిశలబైట పెద్దా చిన్నా ఆడ మగా అంతా కూర్చుని అల్లుతున్నారు. వారి చేతులు చక చక కదలిపోతున్నాయి. ఒక్కక్షణం ఆలస్యమైతే ఎవరేం చేస్తారో— అన్న భయం వారిలో వుంది.

ఆ సాయంత్రం నాగమ్మ పెద్ద కొడుకు చంద్రం వచ్చాడు. చేతిలోని చిన్న వెదురు బుట్ట వుంది. వాడు ఆరవ క్లాస్‌లో వున్నా "చిన్నమ్మా-అమ్మ సంత కెళ్ళి ముప్పైరెండు చేటలమ్మింది. మంచి సీతాఫల వ్పండ్లుంటే నీ కని పంపిందమ్మా" అని బుట్ట ఇచ్చాడు. పెద్ద కళ్ళ సీతాఫలాలు కాంచనకు ఎంతో ఇష్టం. చాలా సంతోషించింది.

"చంద్రం బాగా చదువుకుంటున్నావా?"

"చదువుకుంటున్నానమ్మా. మా అయ్య ఇంట్లో లేడుగా. ఇంట్లో గొడవలేం లేవు"

"హారి పిడుగా" అంది పరిమళమ్మ మెల్లగా.

అప్పుడే నాలుగేళ్ళ పార్వతి వచ్చింది. నాగమ్మకు వరసకు వదినవుతుంది పార్వతి తల్లి.

ఆ పిల్ల జపాన్‌జరీ బుటాలున్న గౌను తొడుక్కుని వచ్చింది. "అబ్బా-పార్వతీ బలే చక్కగా వున్నావే. గౌను మీనాన్న తెచ్చాడా?" పరిమళమ్మ అడిగింది.

"లేదమ్మా. సంతలో మా యమ్మ కొన్నది. మా అయ్య ఏపొద్దూ తేలేదు. మా అయ్యలేడుగా మా అమ్మకాడ కానాదుడ్లున్నాయమ్మా. మరమ్మా మా యమ్మ బెల్లం శనగపప్పు తెచ్చింది. రేపు భక్షాలు చేస్తాది" ఆ పిల్ల గొప్పగా చెప్పుకుంది. దాని అమాయకతకు కాంచన, తల్లి నవ్వుకున్నారు.

"అదసలు గౌను చూపించుకోవాలని వచ్చిందమ్మా" అంది కాంచన.

"ఔనమ్మా ఎక్కడైతే మెప్పు దొరుకుతుందో అక్కడికే వెళ్తారు. చిన్న పిల్లలు మరీను" అందామె.

"చంద్రా! ఇన్ని పళ్ళు పంపింది మీ అమ్మ. మీకున్నాయా?"

"ఉన్నాయమ్మా. బుట్టెడు తెచ్చిందమ్మా. మగ్గినకాడికి తిన్నాము" అన్నాడు.

చంద్రం వెళ్ళిపోయిన అరగంటకు చీకటి పడింది. నాగమ్మ వచ్చి వరండాలో కూర్చుంది.

"ఏం నాగమ్మా! వారం రోజులుగా కనిపించ లేదు" అని పలుకరించింది పరిమళమ్మ.

"అంత పని నా నెత్తిన పడిందిగదమ్మా. అల్లటం మా వంతే. అమ్మటం మా వంతే. దాన్నాళ్ళబట్టి పిల్లలకు అవీ ఇవీ చేసిపెట్టాలనుకుంటిని. పిల్లలు కడుపునిండా తింటున్నారు. మా చంద్రం, నరసు కూడా అల్లికలో సాయం చేస్తా ఉండారమ్మా. ఇరవై రూపాయలన్నా చేతిలో ఆడతా ఉంది. అమ్మా! తాకట్టునుండి ఈ కడియాలు ఇడిపించినాను. జాగ్రత్త చేయితల్లీ".

"ఎంతకు పెట్టావేమిటి"

"నాను కాదమ్మా. నా మొగుడు పెట్టిండు. ఎంతకేంటి? ఇరవైఐదు రూపాయలకి. రెండు నెల్లకి ఐదు వడ్డీ తీసుకుండు."

ఎరుకలమ్మి బుట్ట లాంటి చిన్న బుట్ట అక్కడ పెట్టింది. కాంచన తీసి చూచింది. రెండు చిన్న కడియాలున్నాయి.

"మా నరసువితల్లీ. వారం రోజులన్నా

[లోకజ్ఞానం - సమాధానాలు]

1. మెక్సికోలోని కాన్‌కున్ నగరంలో
2. మానవ సమతని నమ్మి, ఆచరణలో పెట్టి క్రమశిక్షణ గలిగి ప్రజలకు ఆదర్శప్రాయంగా నిలచిన వ్యక్తికి ప్రతి ఏడూ ఇచ్చేందుకు జైతులసి ఫౌండేషన్ సంస్థాపకులు ఆచార్య తులసి ఈ అవార్డును ఈ సంవత్సరం నుంచి ప్రారంభించారు. లక్ష రూపాయల నగదు బహుమతి గల అనువ్రత్ అవార్డు తొలి గ్రహీత ప్రముఖ సైంటిస్ట్, విజ్ఞాన, పారిశ్రామిక పరిశోధక సమాఖ్య మాజీ డైరక్టర్-జనరల్ అయిన డా॥ ఆత్మారామ్. తనకు లభించిన ఈ నగదు బహుమతి మొత్తాన్ని అయిన ఈ ఫౌండేషన్‌కే విరాళంగా ఇచ్చేశారు.
3. భారతీయుడైన సాల్మన్ రషీద్‌కి, అతను రాసిన 'మిడ్ నైట్స్ చిల్డ్రెన్' అన్న నవలకు లభించింది. ఇది అతని రెండవ నవల. బహుమతి మొత్తం రూ. లక్ష డెభ్భైవేలు.
4. జునాగఢ్ (గుజరాత్), కులు (హిమాచల్ ప్రదేశ్), జోర్హాట్ (అస్సాం)
5. 105. ఇవికాక మరో పది విద్యా సంస్థలు కూడా విశ్వవిద్యాలయాలుగా పరిగణింపబడుతున్నాయి.
6. కొచ్చిన్.
7. అస్సాం, నాగాలాండ్, మణిపూర్‌, మేఘాలయా, త్రిపుర రాష్ట్రాలను, కేంద్ర పాలిత ప్రాంతాలైన అరుణాచల్‌ప్రదేశ్, మిజోరమ్‌లను కలిపి ఈశాన్య ప్రాంతపు సోదరీమణులుగా వ్యవహరిస్తున్నారు.
8. అమెరికా, కెనడా, సోవియట్ రష్యా.
9. బ్రిటన్ దేశస్థుడైన దేవర్ 1892 లో కని పెట్టాడు.
10. లిబ్రెవిల్లి, అడిస్ అబాబా, సాన్‌సాల్వడర్, కొనాక్రి, లండన్.

పెట్టుకోలేదు".

"పోనీలే. వస్తువు దక్కింది" అంది పరిమళమ్మ.

"అంతేలేమ్మా" అని లేచింది.

"నాగమ్మా! అతడింకా రాలేదా?"

"లేదమ్మా. ఇంకోనగ ఇడిపించినాక వస్తే మేలు" అని వెళ్ళిపోయింది.

లైటు స్తంభం క్రింద పిల్లలు నవ్వుకుంటూ పరుగులు పెట్టి ఆడుకుంటున్నారు. వాళ్ళకు ఈ స్వేచ్ఛ క్రొత్తగా ఉంది. హాయిగా ఉంది. ఇళ్ళలో గొడవలు లేవు. నాన్న అమ్మను కొట్టటానికి రావటం లేదు. అమ్మ చేతుల్లో డబ్బు ఉంటుంది. అంటే! ఆ పసిపిల్లలు ఈ మార్పుకు ఎటువంటి అర్థం కల్పించారో!

నాల్గు రోజులు పోయాక నీళ్ళకోసం వచ్చిన ఆడవాళ్ళ ముఖాలు చూచి జాలివేసింది. ఉసూరోమంటున్నారు. పిల్లలు చింపిరినెత్తితో మాసిన గుడ్డలతో తిరుగుతున్నారు. దాని అర్థం బోధపర్చుకుని కుమిలిపోయింది కాంచన.

కాంచన ప్రసవం కష్టమైంది. హాస్పిటల్‌లో అడ్మిట్ చేశారు. ఒక పగలు ఒక రాత్రి నొప్పులుపడి పెద్దపాప చందనను ప్రసవించింది. పరిమళమ్మ ఇంటికి వచ్చినప్పుడు కాంచన దగ్గర కూర్చుని ఉండటానికి ఎవరో ఒకరు ఒంతులేసుకుని వెళ్ళేవారు. నాగమ్మ అత్తపాపకు నలుగుపెట్టి నీళ్ళు పోసేది. దంపుళ్ళ పనంతా వాళ్ళే చూచుకున్నారు. తమ ఇంట్లో శుభకార్యం అన్నట్లు స్నానం రోజున కాగుపెట్టి నీళ్ళు కాచి స్నానానికి సాయం చేశారు. సహాయం చేసేవారు ఎక్కువై పోయారని కాంచన తండ్రి తమాషా చేశారు. అందరికి గాజులు తొడిగించి రవికెగుడ్డలు ఇచ్చింది పరిమళమ్మ.

కాంచనకు పాపతోడిదేలోకం అయిపోయింది. బైటప్రపంచంలో ఏం జరుగుతున్నదో కూడా తెలియటంలేదు.

ఇరవై ఒకటవ రోజున నాగమ్మతో మరి ఇద్దరు ఆడవాళ్ళు వచ్చారు. పాపను చూసి ఎర్రటి ఉల్లిపొర కాగితంలో చుట్టిన వెదురుగొట్టం ఇచ్చారు. కాంచన దాన్ని అందుకుని తెరచి చూసింది. వెదురుగొట్టంలో వెండి గజ్జెలు మెరిసిపోతున్నాయి. కాంచన కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"ఎందుకు నాగమ్మా పాపకు ఇవన్నీ ఇవ్వకపోతే...."

"ఎంతలేతల్లీ....అందరం సంబరపడి కొన్నాం. పెట్టమ్మా" అంది మరో ఆవిడ.

ఆ చిన్నారిపాదాలు వారివైపు త్రిప్పి ఒళ్ళో పడుకోబెట్టుకుంది చందనను. ఆ గజ్జెలు రెండు చుట్లు చుడితేగాని పాపకు సరిపోలేదు. మెల్లగా కాలు కదిలిస్తే ఘల్లుఘల్లుమన్నాయి.

"రేపు ఇల్లంతా పారాడినప్పుడు తెలుస్తాది.... చాటుకు పోతివంటే చందనమ్మా అమ్మ కనుక్కునేస్తాది." అంటూ మురిసింది మరో స్త్రీ.

వాళ్ళు త్వరగా వెళ్ళిపోయారు. పాపకు బరువని తెలిసినా వాటిని తీసిపెట్టలేదు. పరిమళమ్మ, కాంచన తండ్రి వాటిని చూశారు.

ఆదొక తీయటి బాధ. ప్రేమకు అంతస్తులు లేవని మరోమారు బుజువైంది.

అప్పుడప్పుడు వచ్చి అంతా పలుకరించిపోయేవారు. వారి ఇంటి పరిస్థితులు ఎలా ఉన్నాయో ఆమె తెలుసుకోటానికి సమయం ఆవకాశం లేకపోయాయి.

మళ్ళీ పౌర్ణమి వచ్చింది. కోలాటం జరుగసాగింది. అంతా నిశ్శబ్దం. వాళ్ళు త్రాగటానికి వెళ్ళిపోయి ఉంటారనుకున్నది కాంచన. ఉదయం ఎనిమిది గంటలకు కిటికీలోంచి ఎండ లోపలికి పడుతుంది. పాపకు ఎండ సోకాలని కిటికీ వద్ద నుంచున్నది. పిల్లలు చిన్న బిందెలతో వస్తున్నారు. కిటికీలోంచి పాపను ఎత్తుకున్న కాంచనను చూసి కొళాయివైపు వెళ్ళకుండా కిటికీ దగ్గరకు వచ్చారు.

"అమ్మా! పాపమ్మ బాగుందా?"

వాళ్ళకు పాప కనబడేలా తిరిగి "బాగా ఉంది. ఏమిటి మీరొచ్చారు?" అంది కాంచన.

"మా అయ్యను, పెద్దయ్యను, బాబయ్యను అంతా పోలీసులు కొండబోయిన్రా" అని మహదానందంతో చెబుతున్నారు. కాంచన నవ్వుకుంది. తండ్రి ఇంట్లో లేకపోతే తల్లి వారి ముచ్చట్లు ఎన్నో తీరుస్తుందన్న ఆశ ఆనందం పట్టలేకపోతున్నారు!

పాపం ఏముంది. ఈ రోజు రేపు ఎప్పుడో వస్తారు. డబ్బు తీసుకెళ్ళి విడిపిస్తారు. ఇది అందరికి మామూలు అయిపోయింది. పావలా అర్ధరూపాయి ప్రోగు చేసుకుని కష్టపడి దాచుకున్నదంతా ఒక్క రోజులో అయిపోతుంది. నెలంతా కష్టపడి పని చేసి సరకు అమ్ముకుని డబ్బు చేతిలో పడిన నాడు పౌర్ణమి వస్తుంది. అంతా నిమిషాల్లో హరించుకుపోతుంది. ఆ క్షణంలో వారికి ముందు చూపుగాని వారు చేస్తున్నది తప్పు అని గాని తెలియదు. ఆ జ్ఞానం వుండదు. కాంచన తండ్రి వారికి బుద్ధి మాటలు చెప్పినప్పుడు తలవంచుకుని ఎంతో వినయంగా మనసులు మార్చుకున్నట్లే కనబడతారు. కాని మళ్ళీ మొదలు!

ఆ సాయంత్రం చీకటి పడిన తరువాత నాగమ్మ అత్త పాపమ్మ వచ్చి వరండాలో కూర్చుంది. కష్టసుఖాల్ని చెప్పుకుని సానుభూతి పొందాలని వస్తారు పాపం. అనుకుని పరిమళమ్మ కుర్చీ ఇవతలికి లాక్కొని కూర్చుంది.

చీర చాటునించి పొడవైన సీసా తీసి ప్రక్కన పెట్టింది. "ఏమిటి ఇది" అని పరిమళమ్మ గాభరా పడింది.

"అమ్మా, బొంగులకై నల్లమల కొండలకు పోతుంటే చందన పాపమ్మకై తేనె తెప్పించినాను. పడబోసి కాని పెట్టుకోమ్మా" అంది.

అలా తెప్పించి పెట్టమని తానుగా అడగాలనుకున్నది. కాని ఆమె ముందరే ఆ పని చేసింది. సీసా మూత తీసి చూసింది. చక్కటి ఘాటైన పూవుల వాసన ముక్కు పుటాలకు సోకింది.

"ఎంతైంది పాపమ్మా?"

"అమ్మా, మాకు మాకు బదుళ్ళుంటాయి. సేట తట్టా బుట్టా చక్కెర ఇత్తా వుంటాం. దీనికి డబ్బు లియ్యమాకు" అంది. దాని ప్రేమాభిమానాలకు ఆనందించింది పరిమళమ్మ. సీసా లోపల పెట్టి వచ్చి కూర్చుంది.

"అమ్మా, నిన్నొకటడగాల...."

"ఓహో....అప్పు కాబోలు...." అనుకున్నదామె ఊరక సీసాడు తేనె ఇచ్చేస్తారా? అందునా పేదవాళ్ళు.

"కొడుకు ఇంట్లో ఉన్నాడా?" లేదన్నట్లు తలాడించింది.

"జైలు నించి రాలేదూ?"

"లేదమ్మా. వాళ్ళు ఇడవలేదు."

"ఏం? డబ్బు కావాలా?"

"ఒద్దు" అన్నట్లు తలూపింది. ఆ మసక వెలుగులో ఆమె కళ్ళు తళుక్కుమన్నాయి. సంధ్య వేళ ఏడవకూడదన్నట్లు ముఖం తుడుచుకుంటూ కన్నీరు తుడిచేసుకుంది.



బి. హెచ్. నారాయణమ్మ

భర్త ఉద్యోగరీత్యా శ్రీమతి నారాయణమ్మ పలు పట్టణాలు తిరుగుతూ మహిళా సభల్లో ఉత్సాహంగా పనిచేశారు. కాకినాడ లేడీస్ క్లబ్‌లో వున్నప్పుడు నాటకాల్లో వేసి బహుమతులు పొందారు. అటు తర్వాత రాజమండ్రిలో కూడా అక్కడి మహిళా మండలిలో ప్రముఖంగా పనిచేస్తూ, నాటకాల్లో నటించారు. ఆటల పోటీల్లోనూ పాల్గొన్నారు. అదే విధంగా గుంటూరులో వున్నప్పుడు కూడా పాల్గొంటూ, బహుమతులు తెచ్చుకున్నారు. కళాసాగర్-వనిత నిర్వహించిన పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని, 'కార్డ్స్ గేమ్'లో ఉత్తమ బహుమతి పొందారు.

"ఈసారి ముప్పై జుల్మానా వేసినారు. అందరి కాడ దాచిన దుడ్లని పోగేసినాము కాని...." అగి మళ్ళీ కళ్ళు ఒత్తుకుంది.

"ఏమైంది పాపమ్మా?"

ఆత్రంగా అడిగింది. కాంచన కూడా వరండా అవతలి గదిలో కూర్చుని కుతూహలంగా వింటోంది.

"అయ్యని అదే ఉండనీ అన్నాదమ్మా ఆ చిన్నది—"

"నరసే!" అంది ఆశ్చర్యంతో ముక్కు మీద వ్రేలేసుకుని.

"ఔనమ్మా,"

పాపమ్మ హృదయం ఎగిసి పడుతుంది. ఏదో చెప్పాలని ఆరాట పడుతోంది గాని గొంతులో ఏదో అడ్డం పడినట్లు గుటకలు మ్రింగుతుంది.

"మెల్లగా బోధపర్చక పోయావా?"

ఆమె తల అడ్డంగా ఆడించింది. "ఒక్క దానికైతే సెబుదును. పిల్లమూకంతా అదేమాట."

"ఎవరూ! మీవాళ్ళ పిల్లలంతానా?"....

"కాదమ్మా. నా మనవళ్ళు మనమరాళ్ళు...."

అంతా నిశ్శబ్దం. ఆ ముగ్గురి ఆలోచనలు పరిపరి విధాలుగా ఉన్నాయి. పిల్లలకు ఏమీ తెలియదు. అనుకుంటాం గాని, వాళ్ళకు తెలియనిది ఏమీ లేదు. వాళ్ళకున్న ఆలోచనా పరిజ్ఞానం ఎవరికుంది?

"మిగతా మగాళ్ళంతా వచ్చేశారా?"

"వచ్చిన్రమ్మా. నన్ను నాగమ్మను మింగేసేలా చూత్తుంటే నాకెంత చిన్నతనంగా ఉందో తల్లీ."

"చంద్రం మీద చెప్పావా?"

"లేదమ్మా. వాళ్ళు అణ్ణి బతకనిత్తారా? తండ్రిని ఇడిపించుకోవాలంటే ఒద్దనే కొడుకుని బతకనిత్తారా! సచ్చేదాక తంతారు. అల్ల కొడుకులు అదేమాటంటారేమోనని భయ్యం, అల్ల కొడుకులు కూడా నేరుత్తారేమో అని శంక. ఇయ్యాల మా వాడు ఒద్దు అనె-రేపు ఇంకోడు వద్దనె-ఇంకోనాడు ఇంకోడు ఒద్దనె-ఒర్నాయనో-ఈకాలం పిల్లల్ని ఏమందుము తల్లీ!" అని తల పట్టుకుంది పాపమ్మ.

ఇదే సాగిందంటే పిల్లల్ని బళ్ళకు పంపటం మానేస్తారు.

"ఏం చెయ్యమంటావు పాపమ్మా."

"చంద్రాన్ని పంపుతా. కొంచెం చెప్పిచూడు తల్లీ...ఒద్దంటే ఎట్టా? తండ్రాయె — ఇంటికి పెద్దయె. కులమోళ్ళమాట ఇనకపోతే ఎలేత్తారమ్మా".

కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడిచాయి. కాంచన మెల్లగా అడిగింది "పాపమ్మా! నిజం చెప్పు... నీ కొడుకు జైల్లో ఎల్లకాలం ఉండడు. పది రోజులుంచుకుని ఒదిలిపెడ్తారు. ముప్పై కట్టి విడిపించుకుని వస్తావు. ఆ ముప్పై పోయినట్టే. వచ్చిన రెండు రోజులు పని చెయ్యడు. వచ్చింది వచ్చినట్లు తాగివస్తాడు. పిల్లలకు భార్యకు నీకు ఏమీ మిగలదు. రెక్కలు ముక్కలయ్యేలా పని చేస్తారు. ఒక్కపూట తిండికి రాదు. మొన్న పదిహేను రోజులు ఎక్కడికో వెళ్ళివచ్చారు. ఏం తెచ్చారు? ఏమీ లేదు. మరి కొంత అప్పు జేశారు. ఆ రోజుల్లో పిల్లలకు కడుపునిండా అన్నం పెట్టారు. కొంత తాకట్టు వస్తువుల్ని విడిపించుకున్నారు. తండ్రి లేనప్పుడు మార్పు వాళ్ళకు బాగా తెలిసిపోయింది. ఇంట్లో హాయిగా ఉంది. అమ్మ-అవ్వ ఏడవరు. పాయసం భక్ష్యం దొరుకుతుంది. హాయిగా పడుకోవచ్చు అనుకున్నారు పిల్లలు. మీ కులం పెద్దల భయంతో ఈ మాట అంటున్నావు కాని నాల్గు రోజులు అక్కడే ఉంటే సుఖం అనుకోటం లేదూ?"

పాపమ్మ నిర్ఘాంతపోయి చూచింది. తన మనసులో మాట పసిగట్టి కాంచనమ్మ ఎలా చెప్పగల్గుతుంది? కొడుకు లచ్చనంగా నాల్గురోజులు జైల్లో ఉంటారు. అంతేగదా-అనుకోలేదూ తను? ఆ మాటకు జవాబు చెప్పకుండా అంది. "అమ్మా చంద్రం తాత అట్టాగే సేసేవాడు. జైల్లో కూకుని వచ్చేవాడు. చంద్రం అయ్య అట్టాగే సేత్తా ఉండె. రేపు చంద్రం గూడ అంతే."

"అంతే అని ఎందుకనుకోవాలి? మీ వాళ్ళలో తాగకుండా ఇంట్లో ఉండేవాళ్లు లేరా?"

"ఎందుకు లేరమ్మా. అళ్ళంతా నోరు లేనోళ్ళు. ముందుకొచ్చి చంద్రాన్ని రచ్చించరు. ఈ తాగేవాళ్ళ జోలికి రారు. మాలాంటోల్లను గాలికొదిలేసారు. కాని ఈ తాగేవాళ్ళంతా శానా కట్టుగా ఉంటారు తల్లీ."

"పాపమ్మా నువ్వు-నేను బాధపడి...." పరిమళమ్మ ఏదో అంటూనే ఉంది. చంద్రం మెల్లగా వచ్చి దండంపెట్టి అవ్వ దగ్గర కూర్చున్నాడు. మామూలుగా పాపమ్మకు మనవడి మీద ఎంతో ప్రేమ వుంది. కాని ఈ పూట మౌనంగా కూర్చుని ఉంది.

"చంద్రం-అవ్వ అన్నీ చెప్పింది. నువ్వు మంచికే అన్నావు. కాని దీనివల్ల మా అందరికి చాలా కష్టం కల్గేలా ఉంది. ఈసారికి విడిపించనీ."

"మా అయ్య అక్కడుంటే మాకు ఇక్కడ బాగుంటాదమ్మా" గొణిగినట్లు అన్నాడు చంద్రం.

"ఔను. కాదనను. కాని దీని మూలంగా మీ కందరికి ఎంత కష్టమో గ్రహించావా? రాత్రి వచ్చిన వాళ్ళంతా మీ మీద పగపట్టినట్లున్నారట. నువ్వు ఒక్కటే ఆలోచించావు. రెండోది కనబడనిది. నీ ఆలోచనకు అందదు. నీ తండ్రి పది రోజులు జైల్లో ఉండి వస్తాడు. మీరు హాయిగా ఉన్నారన్న కసి అతడిలో ఉంటుంది. పగ సాధించాలని వస్తాడు. మిమ్మల్ని మీ అమ్మను కొడతాడు. విడిపించనందుకు తిట్టి పోస్తాడు. మీ జీవితాలు ఇంకా దుర్భరం అవుతాయి. ఒక్క పని చేయడు. తనను పది రోజులు మీరంతా కలిసి జైల్లో ఉంచినట్లు భావిస్తాడు. తనంటే మీ కందరికి నిర్లక్ష్యం అని ప్రేమలేదని అనుకుని సాధిస్తాడు." పరిమళమ్మ మెల్లగా బోధపరుస్తోంది. చంద్రం బిక్కముఖంతో వింటున్నాడు.

కాంచనకు వాడిని చూస్తుంటే కనికరం కల్గింది. దీనివల్ల సుఖం కంటే అనర్థమే ఎక్కువ అన్న సత్యం వాడికి తెలీదు. "చంద్రం ఒక పని చెయ్యి. నీవే వెళ్ళి మీ నాన్నను విడిపించుకురా. మీ పెద్ద వాళ్ళకు డబ్బులిచ్చిపంపకు. నీవే డబ్బు తీసుకెళ్ళు.

ఇంటికి రాగానే నిలేసి అడుగు, అంతేగాని పది రోజులు అలా జైల్లో వుంచెయ్యకురా'' అని ఆప్యాయంగా బోధపర్చింది.

చంద్రం తలూపి లేవటానికుద్యుక్తు డయ్యాడు. మనవడిని గభాల్న వాటేసుకుంది. వాడి తలను గుండెలకు అదుముకుని ఒదిలింది పాపమ్మ చంద్రం వెళ్తుంటే ఆమె కూడా వాడిని అనుసరించింది.

'ఒక్క అడుగు ముందుకు వేయాలంటే ఎరిత కష్టం' అనుకుంది కాంచన.

మరుసటి రోజు చంద్రం డబ్బు తీసుకుని వెళ్ళాడు. జైలుకు వెళ్ళి ఫైను కట్టడం వాడికి కొత్త అనుభవం. ఎంతో అవమానకరంగా వుంది. తన టీచర్లుగాని - క్లాస్‌మేట్స్ గాని తటస్థపడ్తారేమోనని భయం భయంగా నుంచున్నాడు.

తండ్రి బయటికి రాగానే ఆతడిదెస ఏవగింపుతో చూచి తల తాటించి ముందుకు సాగిపోయాడు చంద్రం. తమ కులం పెద్దలు వచ్చారేమోనని అటు ఇటు చూస్తున్నాడు తండ్రి. చంద్రం వెనక్కి తిరిగి చూచి అన్నాడు "వాళ్ళెవరూ రాలేదు. అమ్మ నేను అవ్వ చెల్లెలు అల్లి సంపాదించిన డబ్బంతా కూడబెడితే ముప్పై రూపాయలు అయినై. వాటిని ఎవడికో ఇవ్వటం దేనికని నేనే తెచ్చాను. నిన్ను విడిపించమని ఎవరినో బ్రతిమాలటం దేనికి. నేనే వచ్చిన్నాను. ఇంక మీదట నేనే వచ్చి డబ్బుకట్టి నిన్ను విడిపిస్తాన్లే. నాల్గు రోజులుపోతే నేనుకూడా జైల్లో కూర్చుంటే మనిద్దర్నీ ఎవరిడిపిస్తారు? పద పోదాం. ఇక్కడ వుండటానికి నాకు సిగ్గుగా వుంది'' అంటూ చక చకా సాగిపోయాడు. చంద్రం తండ్రి అవాక్కయి చూస్తున్నాడు.

చంద్రానికి ఇంతధైర్యం ఎక్కడి నుండి వచ్చింది?

అతడు ఆలోచిస్తూ నడుస్తున్నాడు "వీడి కింత జ్ఞానం - ఆలోచన ఎక్కడిది? అదే వాడి అమ్మ నేర్పింది....'' అతడి కోపం అంతా నాగమ్మ మీద కేంద్రీకరింపబడింది. పళ్ళు కొరుక్కున్నాడు. వెళ్ళగానే దాన్ని మద్దు కత్తితో....అనుకున్నాడు.

తండ్రి ముఖంలోని పైశాచికక్రోధాన్ని చూచి చంద్రం మొదట భయపడ్డాడు. తర్వాత కాస్త దూరంగా వెళ్ళి అన్నాడు.

"నాకెవ్వరూ నేర్పలేదులే. అవ్వ-అమ్మ రాత్రి నుండి నిన్ను ఇడిపించి తెమ్మని గోలపెట్టారు. నాకే ఇష్టంలేదు. నువ్వు ఇంట్లో లేకపోతే కడుపు నిండా తింటాం - ఇంట్లో హాయిగా ఉంటుంది.''

అతడి ముఖం వెలవెలబోయింది.

ఇల్లు జేరగానే భార్య తల్లి ఎప్పటిలాగానే అడుగులకు మడుగులొత్తారు. స్నానంచేసి అన్నం తిన్న తరువాత తల్లి అంది. "ఒరేయ్ - పెద్దోడా - కొడుకు పెద్దోడైపోతున్నాడురా.''

కాంచన బాలభానుని తొలి కిరణాల్ని చూచి లేచింది. "ఆ తరువాత ఆ ఇంట్లో జైలు కెళ్ళటం అనేది జరగలేదు. కాని మళ్ళీ మొదలైంది - జైలు కెళ్ళటం అనేది లేదుగా! త్రాగుడు మొదలైంది. ఒక్కొక్క బంగారు నగ మాయమైపోతున్నాయి. పాపం ఈ వెండివి మిగిలాయి.''

రమేష్ ఆమె చెప్పింది విని అర్థం చేసుకున్నాడు. ఈ ఇంటికీ వారికీ మధ్య ఉన్న అనుబంధం ఇప్పటిది కాదు. తను ఈ విషయాల్లో జోక్యం కల్గించుకోకూడదు. ఈ రోజుల్లో శ్రీమంతులకు పేదవారికి మధ్య అగాథం ఉంది. కాని ఈ గృహంలో ఆ ఇరువురుని కలుపుతూ కనుపించని వంతెన ఉంది. ఇంకా మనిషిలో మంచితనం ఉన్నదని ఋజువు అవుతోంది!

రమేశ్‌కు హైద్రాబాదులో పనిబడి ఆదేరోజు రాత్రి వెళ్ళిపోయాడు.

మరుసటి రోజు రాత్రి పిల్లలంతా చదువుకుంటున్నారు. కాంచన పరిమళమ్మ పత్రికలు తిరగేస్తున్నారు.

గేటు చప్పుడైంది. "అమ్మా'' అన్న కేక వినిపించింది.

నాగమ్మ కంఠస్వరం గుర్తించి - కాంచన కొడుకు గేట్ తాళంతీసి వచ్చాడు.

నాగమ్మ ఒక్కత్తీ రాలేదు. వెంట నాగమ్మ భర్త ఉన్నాడు. అతడు వరండాలోకి రాకుండా పై మెట్టుమీద కూర్చున్నాడు. అతడు వచ్చినట్లు తెలిసి కాంచన తండ్రి బైటికొచ్చాడు.

"ఏం కుళ్ళాయప్పా - చాలరోజులకు కనబడ్డావు?''

"ఔ అయ్యా శాన్రోజులైంది'' అని తలపాగా సర్దుకున్నాడు. అంతా నిశ్శబ్దం — కాసేపు ఆగి భార్య డొక్కలో మెల్లగా పొడిచి "నువ్వడుగే'' అన్నాడు.

"అమ్మా నరసుకు మనువు కుదిరినట్లే— మీ వద్ద దాని కడియాలు దాచాను కదా - అటిని కావాలంటున్నాడు. అమ్ముతాడంట. తులం పదేడంట. నూట డెబ్బయి వత్తాయంట. పెద్దయ్యా— నువ్వయినా సెప్పయ్యా - మళ్ళాకొన్లేము. ఒక్క తులం బంగారంలేదు, పిల్లకెట్టా పెండ్లి చేత్తాదో!''

"అయ్యా ఈసారి ఇవ్వు. అరజెంటుగా కావాల.''

"ఏమిటో అర్జంటు....త్రాగటానికేనా?''

త్రాగాలన్న పిచ్చిలో వున్నాడేమో కాస్త చికాకుగా చూచాడు. అందరిదెస వేడికోలుగా చూచి నాగమ్మ వెళ్ళిపోయింది.

"అయ్యా నీ డబ్బు అడగల్లేదుగా-నాపిల్ల దాని కడియాలు ఇయ్యమంటున్నా. అటిని నేనే చేయించా. అయి నాయి. తొందరగా ఇత్తే ఎల్లిపోతా. అన్నీ తాగేశా. ఇదొక్కటే వుందంట, అదీ తాగేత్తా'' ఏనాడు లేనిది ఆనాడు పెద్దయ్య దగ్గర అంత ధైర్యంతో మాట్లాడాడు.

ఆయన ఏదో జవాబు చెప్పాలని నోరు తెరిచాడు కాని కాంచన సైగజేసి లోపలికెళ్ళి కొంత సేపటికి వచ్చింది.

"కుళ్ళాయప్పా! ఇదిగో...ఇవి తీసుకెళ్ళు. నరసుకోసం ఒకప్పుడు ఎంతో ప్రేమతో చేయించావు. అవి దానికోసం వాళ్ళమ్మ ఎంతో భద్రంగా నా వద్ద దాచింది. అవి నీవు చేయించినా అవి నరసువి. అందుకని వాటిని ఇవ్వను. కాని ఇవి తీసుకెళ్ళి అమ్ముకో. ఇవి కూడా ప్రస్తుతం నూట ఏభై అవుతాయి. ఇవి నీవు తీసుకెళ్ళావని చందన తల్లి బాధపడదు. కాని మీరంతా కలసి ఆనాడు 'పాప తల్లి' కాళ్ళను అలంకరించాలని తెచ్చారు. అవి పాపకు పెట్టి మురిసిపోయాను. నేను ఒక్కత్తినే కాదు ఈ ఇంటికి నీళ్ళకొచ్చే ప్రతి ఆడకూతురూ ఎంతో బాధపడ్తుంది. ఫరవాలేదు. నరసు చిన్నపిల్ల-దాని మనసు నొప్పించకూడదు.''

నలిగిన ఎర్ర ఉల్లిపొర కాగితం విప్పి వెదురు గొట్టం తీసింది. దానిని ఒంచింది కాంచన. ఘల్లున గజ్జెలు క్రిందపడినై. కుళ్ళాయప్ప చూపులు క్షణం వాటిపై నిల్చాయి. ఆ తరువాత తల ఎత్తి కాంచన వేపు చూశాడు. ఆమె కళ్ళలోని తడిని తన కన్నీటి పొరల్లోంచి చూశాడు.

"ఒద్దు'' అన్నట్లు చేయి ఆడించి కన్నీళ్ళు తుడుచుకుంటూ మెల్లగా వెళ్తున్న అతడివేపు సంతృప్తితో చూశారు అందరూ. □